సాక్షి ఖమ్మం

శనివారం । 28 । డిసెంబర్ । 2024



మహిళల రక్షణలో విఫలం

పాలకుల పట్టింపులేని తనంతో మహిళలపై హింస, అత్యాచారాలు పెరుగుతున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి పేర్కొన్నారు. 10లో



సోలార్ ప్లాంట్ వద్ద ప్రమాదం

కారేపల్లి – ఇల్లెందు మండలాల సరిహద్దులోని సోలార్ ప్లాంట్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 17°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం, సాయంత్రం చలిగాలుల ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

దేశం ఓ విశిష్ట వ్యక్తిని కోల్పోయింది..

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై మంత్రి పొంగులేటి



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: క్లిష్ట పరిస్థితుల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడమే కాక గొప్ప చట్టాల రూపకల్పనలో పాలుపంచుకున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో దేశం ఓ విశిష్ట వ్యక్తిని కోల్పోయిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మాజీ ప్రధాని మృతికి సంతాపంగా ఖమ్మంలోని క్యాంపు కార్యాయలంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ఆయన చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అంతేకాక ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు.

సరిహద్దుల్లో అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ

ఎర్రుపాలెం: తెలంగాణ – ఏపీ సరిహద్దు మీదుగా ధాన్యం, ఇతరత్రా ఏవి కూడా అక్రమంగా రవాణా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. ఎర్రుపాలెంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు, సిబ్బంది పనితీరు, కేసుల నమోదు, విచారణ వివరాలపై ఆరా తీశాక సీపీ మాట్లాడారు. సరిహద్దు ప్రాంతంలో చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేపడుతూ అక్రమార్కులను కట్టడి చేయాలని సూచించారు. అలాగే, పాత నేరస్తుల కదలికలను పరిశీలించాలని తెలిపారు. ఆతర్వాత సీపీ సునీల్‌దత్ దంపతులు మండలంలోని జమలాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని సందర్శించి శ్రీవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌ఐ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



కొణిజర్ల: గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ రోజారాణి తెలిపారు. హౌస్ వైరింగ్, ద్విచక్ర వాహనాలు, ఏసీ మరమ్మతు అంశాల్లో నెల పాటు శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలంలోని తరుణి హాట్‌లో వచ్చేనెల 1, 3, 4వ తేదీల్లో శిక్షణ మొదలవుతుందని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి 100 రోజుల పని దినాలు పూర్తిచేసిన కుటుంబాల్లో యువతకు డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం తరుణీ హాట్‌లో సంప్రదించాలని ఎంపీడీఓ సూచించారు.

హస్తం.. హవానే!



రివైండ్ 2024

గత ఏడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్తా చాటిన కాంగ్రెస్ పార్టీ అదే ఊపును 2024లోనూ కొనసాగించింది. ఇక శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్‌ఎస్‌లో స్తబ్దత నెలకొనగా ఇద్దరు, ముగ్గురు నేతలు ప్రజా సమస్యలపై, ప్రభుత్వ చర్యలపై నిరసన తెలుపుతూ కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆ పార్టీ అంతగా కలిసిరావడం లేదు. ఇక జిల్లాలో పాగా వేయాలని చూసిన బీజేపీకి ఫలితం దక్కకపోగా, కమ్యూనిస్టులు మాత్రం ఓటు బ్యాంకుతో సంబంధం లేకుండా నిరసనలు, ఆందోళనలు చేపడుతూ జనంతో మమేకమవుతున్నారు. మూడు రోజుల్లో ముగియనున్న ఈ సంవత్సరంలో రాజకీయాల పరిస్థితి ఇలా ఉంటే.. ఈ ఏడాది వరదలు ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాలను అతలాకుతలం చేశాయి. వేలాది మంది సర్వం కోల్పోగా, పంటలు నీట మునిగి రైతులపై కోలుకోలేని దెబ్బ పడింది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి జిల్లాలో కాంగ్రెస్ జోరు

- ఇంకోపక్క పట్టు నిలుపుకునేందుకు బీఆర్‌ఎస్ పాట్లు
- బలం పుంజుకునే ప్రయత్నాల్లో కమ్యూనిస్టులు
- ఈ ఏడాది ప్రకృతి విపత్తులతో అతలాకుతలమైన జిల్లా

కాంగ్రెస్ హవా..

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఈ ఏడాది ఎదురు లేకపోగా గతంతో పోలిస్తే పట్టు పెరిగింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి తమదైన ముద్ర ఉండేలా పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల విజయంతో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావడంతో పాటు ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటింది. ఖమ్మం నుంచి పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాలో విస్తరించిన మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కూడా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలిచారు. అలాగే, ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు, రేణుకాచౌదరికి రాజ్యసభ సీటు దక్కింది. అంతేకాక బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పలువురు కాంగ్రెస్‌లో చేరడంతో కేఎంసీలో ఆ పార్టీకి బలం పెరిగినట్లయింది.

బీఆర్‌ఎస్‌కు కోలుకోలేని దెబ్బ

గత రెండు పర్యాయాలు శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ ఒక్కో సీటుకే పరిమితమైనా రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో ఇక్కడ పట్టు పెంచుకుంది. గత ఏడాది చివరలో జరిగిన ఎన్నికల్లో ఒకే సీటు దక్కినా అధికారం లేకపోవడంతో జిల్లాలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎన్నికల ముందు, తర్వాత చాలామంది నేతలు పార్టీ వీడడంతో పాటు కేఎంసీ కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్‌లో చేరారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఖమ్మం సిట్టింగ్ ఎంపీ నామ నాగేశ్వరరావు ఓటమి చవిచూశారు. అయినా పార్టీ బలోపేతం దృష్ట్యా వద్దిరాజు రవిచంద్రకు మరోసారి రాజ్యసభ సభ్యుడిగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశం కల్పించారు. ఆయనతోపాటు మాజీ మంత్రి పువ్వాడ, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా అధ్యక్షుడు తాతా మధు తదితరులు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అధిష్టానం పిలుపు ఇచ్చినప్పుడే క్షేత్రస్థాయికి వస్తుండడంతో కేడర్‌లో నిస్తేజం అలుముకుంది.



ఆగస్ట్ 15 : వైరాలో నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల్లోపు రైతుల రుణాలు మాఫీ చేశారు.

కనీవిని ఎరుగని వరద..

ఈ ఏడాది జిల్లాపై వరదల ప్రభావం తీవ్రంగా పడింది. వరదలతో వందలాది మంది నిరాశ్రయులు కాగా.. పంట చేలన్నీ దెబ్బతిన్నాయి. ఆగస్ట్ 31, సెప్టెంబర్ 1న జిల్లాలో భారీగా కురిసిన వర్షాలతోపాటు ఎగువ నుంచి వరద రావడంతో మున్నేరు నదితోపాటు పాలేరు రిజర్వాయర్ పొంగి పొర్లింది. మధిర నియోజకవర్గం, మున్నేరు పరీవాహక ప్రాంతాలైన ఖమ్మం, ఖమ్మంరూరల్ ప్రాంతాల్లోని కాలనీలను వరద ముంచెత్తింది. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్‌లోని మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని 70 కాలనీల్లోకి నీరు చేరడంతో 15 వేల ఇళ్ల వరకు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విలువైన పత్రాలు, సర్టిఫికెట్లు, సామగ్రి వరద పాలై కాలనీవాసులు సర్వస్వం కోల్పోయారు. జిల్లావ్యాప్తంగా ఈ వర్షాలు, వరదలతో దాదాపు రూ.339 కోట్ల మేర నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు.



పని చేయని బీజేపీ మ్యాజిక్



జిల్లాలో బలోపేతం అయ్యేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వలేదు. అసెంబ్లీ ఫలితాలు బెడిసికొట్టగా లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సహా పలువురు ప్రచారం చేసినప్పటికీ గెలుపు దరిదాపులకు కూడా రాలేదు. మరోపక్క ఓటు బ్యాంక్ సైతం పెరగకపోవడంతో గతంలో మాదిరి జిల్లాపై పార్టీ ఫోకస్ కొంత తగ్గించింది.

ప్రజల బాటలో కామ్రేడ్లు



సీపీఐ, సీపీఎం నేతలు జిల్లాలో ఉనికి చాటుకునే ప్రయత్నాలను గట్టిగానే చేస్తున్నారు. సీపీఐకి అధికార కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్నప్పటికీ జిల్లాలో ప్రజాసమస్యలపై గళం విప్పుతోంది. సీపీఎం సైతం పలు సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తోంది. సీపీఎం జిల్లా మహాసభలను ఇటీవల సత్తుపల్లిలో నిర్వహించగా జాతీయ నాయకుడు రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇతర నేతలు హాజరయ్యారు. ఇక సీపీఐ శత వార్షిక వేడుకలను ఖమ్మం నిర్వహించగా పెద్దసంఖ్యలో శ్రేణులు పాల్గొన్నాయి. ఓటు బ్యాంక్ రాజకీయాల్లో వెనుకబడినప్పటికీ ఉభయ కమ్యూనిస్టులు ప్రజల్లో పట్టు కోల్పోకుండా ఉద్యమాలు చేపడుతున్నారు.

ఈ ఏడాది ముఖ్య ఘటనల్లో కొన్ని..





- **ఫిబ్రవరి 14 :** బీఆర్‌ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ నుంచి రేణుకాచౌదరి రాజ్యసభకు నామినేట్ అయ్యారు.
- **ఫిబ్రవరి 16 :** డీసీసీబీ అధ్యక్షుడిగా నాగభూషణం స్థానంలో దొండపాటి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు.
- **మార్చి 2 :** సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, 16 రాష్ట్రాల్లో ఉన్న పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ పార్టీలు విలీనమై సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా అవతరించగా విలీన సభ ఖమ్మంలో నిర్వహించారు.
- **ఏప్రిల్ 19 :** బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ కార్యక్రమానికి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరయ్యారు.
- **ఏప్రిల్ 29 :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు.



- **మే 13 :** లోక్‌సభ ఎన్నికలు
- **మే 27 :** ఎమ్మెల్సీ ఎన్నికలు
- **జూన్ 4 :** లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడగా ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి విజయం సాధించారు.



- **జూన్ 8 :** ఉమ్మడి జిల్లాకు చెందిన పొదెం వీరయ్య, మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, నూతి శ్రీకాంత్ రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో నియమితులయ్యారు.
- **నవంబర్ 27 :** సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ గుండెపోటుతో మృతిచెందారు.
- **డిసెంబర్ 18 :** సత్తుపల్లిలో జరిగిన సీపీఎం 22వ జిల్లా మహాసభలకు పొలిట్‌బ్యూరో సభ్యుడు బీ.వీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరయ్యారు.
- **డిసెంబర్ 26 :** సీపీఐ శత వార్షిక ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీ, సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సహా ముఖ్యనేతలు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఇందిరమ్మ' దరఖాస్తుల సర్వే

రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీ.పీ.గౌతమ్



సర్వేలో సేకరిస్తున్న పత్రాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ వీ.పీ.గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ అభిషేక్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల సర్వే పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర హౌసింగ్ ఎండీ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలంలోని పెదతండా, జలగంనగర్, కేఎంసీ పరిధిలోని మోతీనగర్, బొక్కలగడ్డ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన సర్వేను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ సర్వే విషయాన్ని దరఖాస్తుదారులకు ముందస్తుగా సమాచారం ఇస్తే వారు అన్ని పత్రాలు సిద్ధం చేసుకుంటారని తెలిపారు. తద్వారా ఎన్యుమరేటర్లు కూడా త్వరగా సర్వే పూర్తిచేయొచ్చన్నారు. ప్రతిరోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయాలని, ఆపై వివరాల నమోదుకు అవసరమైతే అదనపు లాగిన్లు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సర్వే సమయాన అన్ని పత్రాలను నిశితంగా పరిశీలించడమే కాక దరఖాస్తుదారుల ప్రస్తుత స్థితిగతులను వివరించేలా ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని గౌతమ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ సన్యాసయ్య, హౌజింగ్ పీడీ బి.శ్రీనివాసరావు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణికి వెన్నెముకలా విజిలెన్స్ విభాగం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థకు విజిలెన్స్ విభాగం వెన్నెముక వంటిదని సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. ఈ విభాగం నేతృత్వాన ఉద్యోగులు, సంస్థ ఆస్తుల పరిరక్షణ, మెడికల్ బోర్డ్ పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయంలో విజిలెన్స్ విభాగం అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సంస్థ ఆస్తుల పరిరక్షణతో పాటు అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. మెడికల్ బోర్డ్‌లో అన్‌ఫిట్ చేయిస్తామని డబ్బు వసూలు చేసే వారిని కట్టడి చేయాలని సూచించారు.

పలు అంశాలకు ఆమోదం

కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయంలో శుక్రవారం 103వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ బలరామ్, డైరెక్టర్ సత్యనారాయణరావుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వార్షిక లెక్కలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు చర్చించిన పలు అంశాలను ఆమోదించినట్లు అధికారులు తెలిపారు.

హోరాహోరీగా పోరు!





ఏకకాలంలో రెండు కోర్టుల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురు మధ్య జరుగుతున్న మ్యాచ్‌లు (ఇన్‌సెట్) వరంగల్ - నల్లగొండ జట్ల మధ్య మ్యాచ్..

- పటేల్ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ
- పాత పది జిల్లాల నుంచి హాజరైన 240 మంది క్రీడాకారులు
- ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌ల నిర్వహణ

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీఎం కప్ బాలబాలికల వాలీబాల్ పోటీలు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేసినప్పటికీ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో సాదాసీదాగా మొదలుపెట్టారు. పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్ కుమార్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ ప్రారంభించగా, తొలుత మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా క్రీడాకారులు మౌనం పాటించడంతో పాటు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని, రాత్రివేళ కూడా పోటీలు నిర్వహించేలా కోర్టుల వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుట్టా శంకరయ్య, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్‌అలీ, పాఠశాలల క్రీడా సంఘం జిల్లా కార్యదర్శి కె.నర్సింహమూర్తి, క్రీడా సంఘాల ప్రతినిధులు ఎం.డీ.షఫీక్ అహ్మద్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఖమ్మం బాలుర జట్టు

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి పాత పది జిల్లాల వారీగా బాలబాలికల జట్లు హాజరయ్యాయి. మొత్తంగా 240మంది క్రీడాకారులతో పాటు కోచ్‌లు, మేనేజర్లు 60మంది హాజరయ్యారు. తొలిరోజైన శుక్రవారం బాలుర లీగ్ పోటీల్లో పూల్ 'ఏ' విభాగం నుంచి ఖమ్మం – మెదక్ జట్లు తలపడగా వరుసగా మూడు సెట్లలో 25–17, 25–20, 25–19 పాయింట్లు సాధించిన ఖమ్మం జట్టు విజయ దుందుభి మోగించింది. రెండో మ్యాచ్ వరంగల్–నల్లగొండ జట్ల మధ్య జరగగా 3–0 తేడాతో వరంగల్ నెగ్గింది. ఇక పూల్ 'బీ'లో మహబూబ్‌నగర్ – హైదరాబాద్ జట్ల నడుమ మ్యాచ్ జరగగా 3–0 స్కోర్‌తో మహబూబ్‌నగర్, రంగారెడ్డి – కరీంనగర్ మధ్య మ్యాచ్‌లో 3–0 తేడాతో రంగారెడ్డి జట్టు విజయం సాధించింది. బాలికల విభాగానికొస్తే సరికి నిజామాబాద్ – ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 3–0 తేడాతో నిజామాబాద్ గెలవగా, నల్లగొండ–రంగారెడ్డి జట్లు తలపడిన మ్యాచ్‌లో నల్లగొండ జట్టు వరుసగా మూడు సెట్లు గెలిచి విజేతగా నిలిచింది. ఆతర్వాత వరంగల్– మెదక్ జట్ల మ్యాచ్ ఐదు సెట్లలో జరగగా 3–2 తేడాతో వరంగల్ విజయం సాధించింది. ఇక మహబూబ్‌నగర్–కరీంనగర్ జట్లు తలబడిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 3–0 తేడాతో గెలుపు దక్కించుకుంది.

కేజీబీవీల్లో పోలీసు సిబ్బంది

- ఉద్యోగుల సమ్మె నేపథ్యాన భద్రతా ఏర్పాట్లు
- బోధనకు సైతం ప్రత్యామ్నాయాలపై దృష్టి



ఖమ్మం రూరల్ కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు సర్వీస్ క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కొన్నాళ్లుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. అయితే, కస్తూర్బాగాంధీ విద్యాలయాల(కేజీబీవీ)ల్లో డే అండ్ నైట్ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సైతం సమ్మెలోకి వస్తున్నారని ఆ సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖాధికారికి ఇటీవల వినతిపత్రం సమర్పించారు. దీంతో కేజీబీవీల్లో బాలికల భద్రతతో పాటు బోధన విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలో డీఈఓ సోమశేఖరశర్మ అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. అలాగే, ఉన్నతాధికారులు సూచనల మేరకు జిల్లాలోని 14 కేజీబీవీల్లో ఇద్దరేసి పోలీసు సిబ్బంది(హోంగార్డు /కానిస్టేబుల్)కి విధులు కేటాయించారు. అంతేకాక స్థానిక రెవెన్యూ, విద్యాశాఖ సిబ్బంది సైతం కేజీబీవీలకు చేరుకుని పర్యవేక్షిస్తున్నారు.

318మంది ఉద్యోగులు

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 14 కేజీబీవీలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు ఎమ్మార్సీ తదితర విభాగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా 586మంది విధులు ఉద్యోగులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో కేజీబీవీల్లోనే 318మంది పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీరంతా సమ్మెలోకి దిగడంతో అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కేజీబీవీల్లోని బోధన సిబ్బంది సమ్మెకు దిగడం, ప్రభుత్వం తరఫున చర్చలేవీ జరకపోవడంతో విద్యార్థినులు నష్టపోకుండా ఆన్‌లైన్ ద్వారా పాఠాలు బోధించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకోసం రెండు రోజుల్లోగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి బోధన ప్రారంభిస్తారని సమాచారం. అంతేకాక పర్యవేక్షణ కోసం కేజీబీవీల్లో స్పెషల్ ఆఫీసర్లుగా అదే మండల పరిధిలోని సీనియర్ హెచ్‌ఎంలను నియమించనున్నట్లు తెలిసింది.

విద్యార్థినుల భద్రతపై ప్రత్యేక దృష్టి



ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో కేజీబీవీల్లో విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇన్నాళ్ల బోధనా సిబ్బంది మాత్రమే సమ్మెలో ఉండగా, శుక్రవారం నుంచి డే అండ్ నైట్ డ్యూటీ సిబ్బంది కూడా సమ్మెకు దిగుతున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేజీబీవీల్లో విద్యార్థినుల భద్రతకు పోలీసు సిబ్బందిని కేటాయించారు. ఇక ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించాలనే ఆలోచన ఉంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

మహిళా కూలీలకు మంత్రి కుశల ప్రశ్నలు


మహిళా కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డ తండాలో ఓ కార్యక్రమానికి శుక్రవారం వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మార్గమధ్యలో పొలంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలను చూసి ఆగారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అలాగే, ఎకరంలో నాటు వేస్తే ఎంత ఇస్తారు.. ఎకరం పొలంలో నాట్లు వేయడానికి ఎంత సమయం పడుతుందని ఆరాతీశారు. అయితే, తామంతా గిరిజనులమని, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని వారు కోరారు. దీంతో మంత్రి స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వమే గిరిజనులదని.. అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, తొలుత ఎర్రగడ్డ తండాలో కాంగ్రెస్ నాయకుడు కిశోర్‌నాయక్ వివాహ వేడుకకు హాజరైన మంత్రి వధూవరులను ఆశీర్వదించారు.

నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: నల్లగొండలో శనివారం మొదలుకానున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక సంపాదకవర్గ సభ్యుడు జీ.వీ.నాగమల్లేశ్వరరావు కోరారు. ఈమేరకు ఖమ్మంలోని యూనియన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావుతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించిందని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు వల్లంకొండ రాంబాబు, డీ.ఎస్.నాగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, యు.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ధాన్యం కాంటాలు


ధాన్యం కాంటా వేయిస్తున్న పీఏసీఎస్ బాధ్యులు

నేలకొండపల్లి: ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యంపై 'సాక్షి'లో గురువారం 'కొనుగోలు కేంద్రంలోనే మొలకెత్తుతున్న ధాన్యం' శీర్షికన కథనం ప్రచురితమైంది. నేలకొండపల్లి మండలం మంగాపు రం తండాకు చెందిన రైతు భూక్యా కిషన్‌రావు నెల రోజులుగా పడిగాపులు కాస్తున్న వైనాన్ని ఇందులో వెల్లడించగా రాజారాంపేట పీఏసీఎస్ బాధ్యులు కదిలారు. ఈమేరకు శుక్రవారం కిషన్‌రావు నాలుగెకరాల్లో సాగుచేసిన ధాన్యం కాంటా వేయించగా ఆయన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపా రు. కాగా, ధాన్యం కాంటాలను పీఏసీఎస్ చైర్మన్ డి.బాలాజీ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సీఈఓ రామకోటయ్య పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

ఖమ్మం క్రైం: ఖమ్మం శ్రీనివాసనగర్‌లో గురువారం అర్ధరాత్రి దాటాక ముఖాలకు ముసుగులు ధరించిన గుర్తుతెలియని వ్యక్తులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. శ్రీనివాసనగర్‌కు చెందిన భరత్‌కుమార్‌కు చెందిన ద్విచక్ర వాహనంతో పాటు మణి అనే వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. అలాగే, ఇంకొకరి ఇంట్లోనూ సామగ్రి చోరీ చేశారు. కాగా, బాధితుల్లోని ఒకరి ఇంటి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడి ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా, ఘటనపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీ టౌన్ సీఐ రమేష్ తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,300	6,300
మిర్చి	15,606	5,000
మిర్చి తాలు	10,000	5,000
ఏసీ మిర్చి	16,000	6,500
ఏసీ తాలు	7,700	6,000
పత్తి	7,100	6,200

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,413

పటేల్ స్టేడియంలో క్రీడోత్సాహం

రాష్ట్రస్థాయి సీఎం కప్ వాలీబాల్ పోటీలకు ఖమ్మం ఆతిథ్యమిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే పోటీలు శుక్రవారం మొదలవగా రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి బాలబాలికల జట్లు ఇక్కడకు చేరుకున్నాయి. ఒకేసారి నాలుగు మ్యాచ్‌లు నిర్వహించడంతో పాటు రాత్రివేళ కూడా ఆటంకం ఎదురుకాకుండా సర్దార్ పటేల్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటుచేశారు. దీంతో అటు పాయింట్ల కోసం క్రీడాకారుల పోటాపోటీ.. ఇటు వారిని ఉత్సాహపరుస్తున్న సహచరుల ఈలలు, కేకలతో స్టేడియం మార్మోగిపోతోంది. ఈసందర్భంగా వివిధ జిల్లాల క్రీడాకారులు, నిర్వాహక బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అధికారులను పలకరించగా వారి అభిప్రాయాలు వెల్లడించారు. – ఖమ్మం స్పోర్ట్స్

- మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ
- పాత పది జిల్లాల నుంచి హాజరైన బాలబాలికల జట్లు
- ఒకేసారి నాలుగు మ్యాచ్‌లు జరిగేలా కోర్టులు


హైదరాబాద్- ఖమ్మం బాలికల జట్ల మ్యాచ్‌లో పాయింట్ కోసం ప్రయత్నిస్తున్న క్రీడాకారులు

పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు


కొద్దిరోజులుగా ప్రణాళికతో వ్యవహరిస్తూ టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పది జిల్లాల నుంచి బాలికల జట్లు కూడా వచ్చినందున వసతి విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నాం. ఖమ్మం కీర్తిని ఇనుమడింపచేసేలా టోర్నీ నిర్వహణకు పలు కమిటీలను ఏర్పాటు చేశాం.

– టి.సునీల్ కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ, ఖమ్మం

ఆటంకం లేకుండా ఫ్లడ్‌లైట్లు


ప్రతిరోజు ఫ్లడ్ లైట్ల వెలుతురులో మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పోటీలకు వచ్చిన క్రీడాకారులు ఇక్కడి ఏర్పాట్లను చూసి భేష్ అంటున్నారు. రెఫరీలకు సూచనలు చేస్తూ, మ్యాచ్ పూర్తి కాగానే కాస్త విరామంతో ఇంకో మ్యాచ్‌లు మొదలయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, టోర్నీ టెక్నికల్ కన్వీనర్

పటిష్టమైన వ్యూహాలు


రాష్ట్రస్థాయి పోటీల్లో మన జిల్లా జట్టే గెలుస్తుంది. సీనియర్ వాలీబాల్ కోచ్‌ల వద్ద శిక్షణ తీసుకున్నాం. జట్టులో మంచి బూస్టర్, సెంటర్ క్రీడాకారిణులు ఉండడం కలిసొచ్చే అంశం. పక్కా ప్రణాళికతో అడుగులు వేసేలా వ్యూహాలు రూపొందించినందున తప్పక గెలుస్తాం.

– బి.అంబిక, ఖమ్మం

బలంగా ఖమ్మం జట్లు


వాలీబాల్ టోర్నీలో పాల్గొంటున్న ఖమ్మం జట్లు బలంగా ఉన్నాయి. ఈసారి కప్ గెలుస్తామనే నమ్మకం ఉంది. గత విజయాలు, అనుభవాల ఆధారంగా ఈసారి ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించాం. సొంత జిల్లాలో జరుగుతున్న పోటీల్లో జయకేతనం ఎగురవేయడమే లక్ష్యం.

– ఎం.డీ.అక్బర్ అలీ, కోచ్, ఖమ్మం

గెలిచి సత్తా చాటేలా...


రాష్ట్రస్థాయి పోటీల్లో మా జిల్లా బాలికల జట్టు విజయం సాధించేలా తర్ఫీదు ఇచ్చాం. కప్ మాకు వచ్చినా, రాకున్నా ప్రత్యర్థి జట్లను పటిష్టంగా ఎదుర్కొనేలా ప్రణాళికలు రూపొందించాం. మా బాలికల జట్టు బలంగా ఉంది. క్రీడాకారులు కప్ సాధించాలనే తపనతో సిద్ధమయ్యారు.

– ఎం.వీరస్వామి, కోచ్, నల్లగొండ

తొలిసారి రాష్ట్రస్థాయి టోర్నీలో..


తొలిసారి రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీలో పాల్గొంటున్నా. వ్యక్తిగతంగా ప్రతిభ కనబరిచి హైదరాబాద్ జట్టుకు పేరు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తా. మా సహచరుల్లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారు. జట్టు పటిష్టంగా ఉన్నందున కప్ సాధిస్తామనే నమ్మకముంది.

– జె.అజయ్, హైదరాబాద్

మొత్తం 46 మ్యాచ్‌లు


రాష్ట్ర వాలీబాల్ టోర్నీలో బాల బాలికల విభాగాల్లో కలిపి 46 మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రతీ అంశంలో టెక్నికల్ కమిటీ బాధ్యతగా వ్యవహరిస్తూ పర్యవేక్షిస్తోంది. ఎక్కడా లోపాలు ఎదురుకాకుండా నిపుణులైన రెఫరీలు, లైన్ ఎంపైర్లు, స్కోరర్లను నియమించాం.

– గణపతి, వాలీబాల్ టెక్నికల్ రాష్ట్ర బోర్డు చైర్మన్

ఏర్పాట్లు బాగున్నాయి...


ఇతరచోట్ల టోర్నీలకు వెళ్తే మా ఖర్చులతో భోజనం చేయాల్సి వచ్చేది. ఇక్కడ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ టోర్నమెంట్ నిర్వహిస్తుండడమే కాక మంచి టిఫిన్, భోజనం సమకూర్చారు. ఖమ్మంలో ఇంత మంచి స్టేడియం ఉందని, ఏర్పాట్లు గొప్పగా చేస్తారని అనుకోలేదు.

– బి.ఇందు, మెదక్

కురుక్షేత్రలో తల్లాడ మహిళల గీతాపారాయణం

తల్లాడ: మూడు రోజులుగా హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగిన భగవద్గీత పారాయణంలో ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన గుర్రం మాలిని, సంకా కళ్యాణి, జవ్వాజి నీలిమ పాల్గొన్నారు. శ్రీకృష్ణుడు అర్జునుడికి భగవద్గీతను ఉపదేశించిన వటవృక్షం కురుక్షేత్రలో ఉంటుందని భావిస్తారు. ఈ మేరకు 24 నుంచి 26వ తేదీ వరకు అక్కడ భగవద్గీత పారాయణం ఏర్పాటు చేయగా తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఇందులో తల్లాడ నుంచి ముగ్గురికి అవకాశం దక్కగా పారాయణం అనంతరం వారిని శ్రీగణపతి సచ్చిదానంద మైసూర్ స్వామిజీ అభినందించి జ్ఞాపికలు అందజేశారు.


సత్కారం అందుకున్న తల్లాడ మహిళలు

ప్రియుడి ఇంటి ముందు యువతి బైఠాయింపు

కొణిజర్ల: ప్రేమ పేరుతో తనతో సహజీవనం చేసి ఇప్పుడు ముఖం చాటేశాడని ఆరోపిస్తూ ఓ యువతి ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ఘటన మండలంలోని సింగరాయపాలెంలో చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లాకు చెందిన ఓ యువతికి కొణిజర్ల మండలం సింగరాయపాలెంకు చెందిన సుధీర్‌తో హైదరాబాద్‌లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దీంతో కొన్నాళ్లుగా వారు సహజీవనం చేస్తున్నారు. ఇంతలోనే సుధీర్ ఉద్యోగరీత్యా అమెరికా వెళ్లొచ్చాక సదరు యువతిని దూరం పెట్టినట్లు తెలిపింది. ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో ఆమె సింగరాయపాలెం చేరకుని యువకుడి ఇంటి ఎదుట బైఠాయించింది. దీంతో యువకుడి కుటుంబీకులు తాళం వేసి వెళ్లిపోగా ఆమె అక్కడే కూర్చుని తనకు న్యాయం చేయాలంటూ స్థానిక పెద్దలను కోరుతోంది. ఈవిషయమై ఎస్‌ఐ సూరజ్‌ను వివరణ కోరగా ఇరుపక్షాల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కారు డ్రైవర్‌పై పోక్సో కేసు

రఘునాథపాలెం: బాలికను అపహరించి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన కారు డ్రైవర్‌పై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు కారేపల్లి మండలంలోని భాగ్యనగర్ తండాకు చెందిన కారు డ్రైవర్ షేక్ ఇమామ్ ఆ బాలికను మాయమాటలతో నమ్మించి తీసుకెళ్లడమే కాక అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈమేరకు ఆమెను బాలికను ఆస్పత్రికి తరలించి నిందితుడిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సోలార్ ప్లాంట్ వద్ద రోడ్డుప్రమాదం

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి


మల్లయ్య (ఫైల్)


వెంకటేశ్వర్లు (ఫైల్)

కారేపల్లి/ఇల్లెందు: ఇల్లెందు – కారేపల్లి మండలాల సరిహద్దులో సోలార్ ప్లాంట్ వద్ద మూలమలుపులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఇంకో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇల్లెందు మండలం మాణిక్యారం పంచాయతీ పరిధి ఎల్లాపురానికి చెందిన లక్ష్మణ్, చింటు ఓ బైక్‌పై ఖమ్మం వైపు వెళ్తున్నారు. అదే సమయాన ఇల్లెందు వైపునకు మరో బైక్‌పై ఉసిరికాయలపల్లికి చెందిన ఎల్లావుల మల్లయ్య (40), మారుతి వెంకటేశ్వర్లు ఎదురుగా వచ్చారు. ఈ రెండు వాహనాలు సోలార్ ప్లాంట్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, వెంకటేశ్వర్లు సైతం తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఇల్లెందు ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుల్లో మల్లయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ రాజారాం ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇందిరమ్మ సర్వే కోసం వచ్చి..

హైదరాబాద్‌లో ఉంటున్న ఉసిరికాయలపల్లి వాసి మారుతి వెంకటేశ్వర్లు ఇందిరమ్మ సర్వే జరుగుతుండటంతో తన వివరాలు సమర్పించేందుకు గ్రామానికి వచ్చారు. సర్వే ముగిశాక మిత్రుడైన మల్లయ్యతో కలిసి ఇల్లెందు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో ఇద్దరు మృతి చెందటంతో కుటుంబాల్లో విషాదం నెలకొంది. కాగా, మల్లయ్య మృతదేహంతో పాటు అపస్మారక స్థితికి చేరిన వెంకటేశ్వర్లును ఇల్లెందు ఆస్పత్రికి తీసుకురాగా కుటుంబీకుల రోదనలతో మార్మోగింది.


ఘటనాస్థలిలో క్షతగాత్రులు


ఇల్లెందు ఆస్పత్రిలో రోదిస్తున్న మల్లయ్య కుటుంబీకులు

అనంతరం వెంకటేశ్వర్లును ఖమ్మం తరలించగా ఆయన సైతం మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా రోదించారు. ఇక ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరికి చికిత్స చేస్తున్నారు.

సోలార్ ప్లాంట్ వద్ద తరచూ ప్రమాదాలు

ఇల్లెందు – కారేపల్లి మండలాల సరిహద్దులో ఏర్పాటుచేసిన సోలార్‌ప్లాంట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు నెలల కిందట ఇక్కడే జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. సోలార్ ప్లాంట్ సమీపాన బైపాస్ రోడ్‌లో అనేక మూలమలుపులు ఉన్నాయి. దీంతో కొత్తగా వచ్చే వారే కాక గ్రామస్తులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇకనైనా సింగరేణి, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

బ్రిడ్జి కూలడంతో రాకపోకలు నిలిపివేత


కూలిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎస్సై నాగుల్‌మీరా

చింతకాని: చింతకాని నుంచి కొణిజర్లకు వెళ్లే ప్రధాన రహదారిపై నేరడ సమీపాన ఉన్న కల్వర్టు బ్రిడ్జి శుక్రవారం కూలింది. దీంతో చింతకాని నుంచి నేరడ, కొణిజర్లకు వాహనాల రాకపోకలను నిలిచిపోయాయి. ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో కూలిందని గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు బ్రిడ్జిని ఎస్సై నాగుల్‌మీరా పరిశీలించి రాకపోకలు జరగకుండా ట్రాక్టర్ ట్రక్కు అడ్డు పెట్టించారు. కాగా, అధికారులు ఇక్కడ కొత్త బ్రిడ్జిని నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీసుల అదుపులో పేకాటరాయుళ్లు

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి శివారు పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.4,200 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా గ్రామపంచాయతీ పరిధి జింకలగూడెంలో వివాహితపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదైంది. సదరు వివాహిత పంట చేను నుంచి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన మహ్మద్ సైదా వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమె ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు యువకులు శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బైరవునిపల్లికి చెందిన అరవింద్ ఎలుకల మందు తాగి అస్వస్థతకు గురవడంతో నేలకొండపల్లి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అలాగే, నాచేపల్లికి చెందిన పి.శ్రీనివాస్ కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయనను చికిత్స నిమిత్తం కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, యువకుల ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని పోలిశెట్టిగూడెంకు చెందిన కౌలు రైతు ఉండేటి రమేష్(45) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూలీ పనులకు వెళ్తూనే రమేష్ రెండేళ్లుగా గ్రామంలో రెండెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఆయన మిర్చి సాగు చేయగా పంట పెట్టుబడికి చేసిన అప్పులు పెరగడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనతో ఈనెల 26న ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న రమేష్ శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య పద్మ, ఇద్దరు పిల్లలు ఉండగా కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం

హాజరు కానున్న రామకృష్ణమఠం బాధ్యులు


విద్యుత్ లైట్ల వెలుతురులో స్వామి వివేకానంద విగ్రహం

సత్తుపల్లిటౌన్: శ్రీరామకృష్ణ పరమహంస–స్వామి వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన శని, ఆదివారం సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లను కాషాయ తోరణాలతో అలంకరించడమే కాక జేవీఆర్ పార్క్ వద్ద స్వామి వివేకానంద కాంస్య విగ్రహానికి లైట్లు ఏర్పాటుచేశారు. ఈ ప్రాంగణంలోనే నిర్మించిన స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్స్‌లెన్స్ ఇన్‌స్టిట్యూట్ భవనంలో నిరుద్యోగ యువతకు వృత్తి విద్య నైపుణ్య కోర్సులు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా, తొలిరోజైన శనివారం స్థానిక మాధురి ఫంక్షన్ హాల్‌లో విద్యార్థి సమ్మేళనం జరగనుంది. ఇందులో హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్‌తో పాటు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, విజయవాడ రామకృష్ణ మిషన్ నిర్వాహకులు స్వామి శితికంఠానంద మహరాజ్, ఎస్పీ కేజీవీ.సరిత ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. ఇక మధ్యాహ్నం జరిగే యువజన సమ్మేళనానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు, వందేమాతరం రవీందర్ హాజరవుతారు. అలాగే, ఆదివారం తెలుగు రాష్ట్రాల్లోని రామకృష్ణమఠం, రామకృష్ణ మిషన్ నిర్వాహకులతో భక్త సమ్మేళనం నిర్వహించనున్నారు.

జిల్లా కళాకారులకు పురస్కారాలు


అవార్డు అందుకుంటున్న గోవిందరావు


లక్ష్మీకాంతమ్మ


ఆదెర్ల శంకర్

ఖమ్మంగాంధీచౌక్/కారేపల్లి: జిల్లాకు చెందిన ముగ్గురికి ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూవ్‌మెంట్ సంస్థ పురస్కారాలు ప్రకటించింది. ఈమేరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఖమ్మంకు చెందిన జానపద కళాకారుడు కవి, రచయిత మోదుగు గోవిందరావు, కారేపల్లికి చెందిన ఆదదెర్ల శంకర్‌కు గానకోకిల పురస్కారాలు, చింతకాని మండలం అనంతసాగర్‌కు చెందిన జానపద కళాకారిణి పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు ఉత్తమ కళాకారిణి అవార్డు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి, సంస్థ బాధ్యులు మేకల చంద్రశేఖరయాదవ్, సుదర్శన్ మార్వాడి, రమేష్, కొమిరె వెంకన్న, సీతారాములు తదితరులు వీరికి అవార్డులు అందజేసి సన్మానించారు.

మహిళల రక్షణలో పాలకులు విఫలం

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి



మాట్లాడుతున్న అరుణజ్యోతి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుత సమాజంలో పసిపాప మొదలు వృద్ధులైన మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస పెరుగుతుండటంతో స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు పి.అరుణజ్యోతి అన్నారు. అయితే, మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు విఫలమవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఐద్వా జిల్లా వర్క్‌షాపు మెరుగు రమణ అధ్యక్షతన శుక్రవారం జరగగా ఆమె మాట్లాడారు. మూఢ నమ్మకాలు, డ్రగ్స్, మద్యం, అశ్లీల సినిమాలతో యువత చెడు మార్గం పట్టి మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇకనైనా వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ తీరుతో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడుతున్నందున రక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని తెలిపారు. కాగా, మహిళా అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, నాయకులు మాచర్ల భారతి, బి.పద్మ, పి.నాగసులోచన, మెహరున్నీసా బేగం, కె.అమరావతి, జె.సునీత, పి.ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల వినూత్న నిరసన


బజ్జీలు విక్రయిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంసహకారనగర్: సర్వీస్ క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని దీక్ష శిబిరం వద్ద బజ్జీలు వేసి అమ్మారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు అనిల్, కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తూ కుటుంబాన్ని పోషించడం కష్టంగా ఉందన్నారు. అనంతరం దీక్ష శిబిరంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, రాణి, భగవాన్, శివకృష్ణ పాల్గొన్నారు.